మోకాళ్లపై గిరిజనుల నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి: గత ఐదేళ్ల క్రితం మంజూరైన రోడ్డు పనులను పారెస్టు అధికారుల అభ్యంతరాలతో నిలిచి పోయిందని గిజనులు చేతులు జోడించి వినుత్నంగా నిరసన చేపట్టారు. అనంతగిరి మండలంలో గుమ్మకోట పంచాయతీ శంకుపర్తి మీదుగా గాలిపాడు, శతబి, మెటువలస రోడ్డు పనులకు అటవీ శాఖ అడ్డంకులు తొలగించి రహదారి పనులను పూర్తి చేయండి మహాప్రభో అంటూ స్థానిక సర్పంచ్ పాగి. అప్పారావు నేతృతంలో స్థానిక గిరిజనులు మోకాళ్లపై వినూత్నంగా బుధవారం నిరసన చేపట్టారు. ఎట్టకేలకు రహదారి పనులు చేయాలని అధికారులు చెప్పడంతో రెండు రోజుల క్రితం పనులు ప్రారంభించగా ఫారెస్ట్ అధికారులు అనుమతులు లేవని సరికాదన్నారు. గుమ్మకోట నుంచి శంకుపర్తి, శతాభి, గాలిపాడు, మెట్టువలస గ్రామాలకు కనీసం రహదారి సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నామని గిరిజనులు తెలిపారు.

నిరసన చేపడుతున్న గిరిజనులు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ఆందోళనలు

అరకులో ఆందోళన చేస్తున్న సిపిఎం, కాంగ్రెస్ పార్టీ నేతలు

పాడేరులో రాస్తారోకో చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని అఖిలపక్ష కార్మిక సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా బుధవారం అరకులోయ మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ నిరసనలో సిపియం, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కార్మిక వర్గం పెద్ద ఎత్తున గత రెండు సంవత్సరాలుగా ఆందోళన నిర్వహిస్తున్నా మోడీ ప్రభుత్వం మాత్రం మొండిగా వ్యవహరిస్తుందని తెలిపారు.ఎట్టి పరిస్థితుల్లోని స్టీల్ ప్లాంట్ ప్రైవేటుకరణ కాకుండా అడ్డుకొని తీరుతామని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కారు చౌకగా ప్రధాని మోడీ అనుచరులకు కట్టబెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

తక్షణమే ప్రైవేటీకరణ ఆపాలని, లేకపోతే భవిష్యత్తులో బిజెపి ప్రభుత్వానికి కార్మికులు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.ప్రైవేటీకరణతో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు రద్దవుతాయని తెలిపారు. కేంద్రంలో మోడీని గద్దెదించేందుకు దేశవ్యాప్తంగా బిజెపి వ్యతిరేక శక్తులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాచిపెంట శాంతకుమారి మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం నిత్యావసర ధరలు విపరీతంగా పెంచి పేదలపై భారాలు మోపుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్బి పోతురాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బొండ సన్నిబాబు, గిరిజన సంఘం అరకువేలి మండల అధ్యక్ష కార్యదర్శులు గత్తుం బుజ్జిబాబు, పాంగి రామన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాచిపెంట చిన్నస్వామి, భగత్రాం, అనంతగిరి సిపిఎం మండల కార్యదర్శి ఎస్ నాగులు , కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకర ణను కేంద్ర ప్రభుత్వం ఆపాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా సిఐటియు, ఎఐటియుసి కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, లాభాల్లో ఉన్న స్టీల్ ప్లాంట్‌ను ఆదానికి కట్టబెట్టడానికి నరేంద్ర మోడీ పూనుకున్నారన్నారు. దీనికి సీఎం జగన్ వంత పాడుతున్నారని విమర్శించారు. 32 మంది ప్రాణ త్యాగంతో 64 గ్రామాల ప్రజలు 16500 మంది నిర్వాసితులు 22వేల ఎకరాల భూమిని త్యాగం చేసి ఇచ్చారని తెలిపారు. 1966లో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో ఉద్యమం మొదలైందని, అప్పుడు ఉన్న కేంద్ర ప్రభుత్వం 4890 కోట్లు ఇచ్చిందన్నారు. ఈ స్టీల్‌ప్లాంట్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో 44 వేల కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. మూడు లక్షల కోట్లు విలువచేసే స్టీల్ ప్లాంట్ ను కారు సౌకగా 1300 వందల కోట్లకు దారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చేయడమంటే దళితులు, గిరిజనుల రిజర్వేషన్ తీసేయడమేనన్నారు. నరేంద్ర మోడీ విధానాలు ఈ దేశానికి ప్రమాదమని, ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కన్వీనర్ అమర్, సిపిఎం మండల కార్యదర్శి .లింగేరి సుందర్‌రావు, సిపిఐ మండల కార్యదర్శి కూడా రాధాకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మాణిక్యం,. సిపిఐ నాయకులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

లారీపై విరిగిపడ్డ చెట్టు

-డ్రైవర్, క్లీనర్ కు గాయాలు

ప్రజాశక్తి -అనంతగిరి: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అనంతగిరి జూనియర్ కాలేజ్ కాఫీ తోటల సమీపం వద్ద లారీపై భారీ చెట్టు విరిగిపడింది. దీంతో, డ్రైవర్, క్లీనర్‌లకు తీవ్ర గాయాలు పాలయ్యాయి. బుధవారం మూడు గంటల సమయంలో అనంతగిరి నుండి విజయనగరం జిల్లా బొడ్డవర తిరిగి వెళుతున్న లారీపై రోడ్డు పై ఉన్న భారీ చెట్టు విరిగి పడడంతో త 200 అడుగుల దూరం చెట్టును లారీ లాక్కును వెళ్ళింది. ఆ క్రమంలో డ్రైవర్ చాకచక్యం వహించడంతో రోడ్డు గట్టున ఆగింది. లేకుంటే లోయలోకి దూసుకు పోవాల్సింది. బాధితులను ఆటోలో స్థానిక ఆసుపత్రికి తరలించారు.

దెబ్బతిన్న లారీ ముందు భాగం

నేడు ప్రచార భేరి బహిరంగ సభ

సిపిఎం పాలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, సిపిఐ జాతీయ నాయకుల హాజరు

ప్రజాశక్తి-చింతూరు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కార్మిక, కర్షక, గిరిజన, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం చింతూరు మండల కేంద్రంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు సర్వం సిద్ధం చేశారు. ఈ బహిరంగ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కారత్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావులపల్లి వెంకయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగిస్తారు. గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు చింతూరులో రెండు కేంద్రాల నుండి భారీ ప్రదర్శన నిర్వహించి, అనంతరం సాయంత్రం 4 గంటలకు చింతూరు పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వేలాది మందితో బహిరంగ సభ జరగనుంది. ఈ బహిరంగ సభలో బృందాకరత్, వెంకయ్యతో పాటు మాజీ ఎంపీ, ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచి జాతీయ చైర్మన్ డాక్టర్ మీడియం బాబురావు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, ఎపి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, ఇరు పార్టీల జిల్లా నాయకులు ప్రసంగించనున్నారని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ తెలిపారు. ఈ బహిరంగ సభకు ప్రజలు అత్యధికంగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెంచడంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. గ్యాస్ బండ రూ.1150కి చేరుకొని గుదిబండగా మారింది. ఫలితంగా ప్రజల బతుకులు దుర్భరంగా మారాయి. మరో వైపు ప్రజల ఆదాయం పెరగకపోగా, మరింత దిగజారింది. ఏడాదికి 3 కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేసిన మోడీ కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా, ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టే విధానాలను అనుసరిస్తున్నారు. గ్రామీణ పేదలను ఆర్థికంగా ఆదుకుంటున్న ఉపాధి హామీ చట్టానికి ప్రతి ఏటా నిధులు తగ్గిస్తూ దానిని నిర్వీర్యం చేస్తున్నారు. విద్యా వైద్యానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గిపోయాయి. మరో వైపు రాష్ట్రంలో అతి పెద్ద ఉక్కు పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో సహా దేశానికి వెన్నెముక లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను అదాని, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా ధారాదత్తం చేయడానికి పూనుకున్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వడం లేదు. గిరిజనులకు రక్షణగా ఉన్న చట్టాలను సవరిస్తూ అడవులను కార్పొరేట్లకు అప్పగించేందుకు కుట్ర చేస్తున్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ప్రశ్నించకుండా కులం, మతం, ప్రాంతం, ఆచార వ్యవహారాల పేరుతో విద్వేశాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య చీలికలు తెస్తున్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ కేంద్ర కమిటీల పిలుపు మేరకు ఏప్రిల్ 14 నుండి ప్రచార భేరి నిర్వహించారు. దీని ముగింపు సందర్భంగా గురువారం చింతూరులో బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. కేంద్ర విధానాలతో పాటు ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు విడుదల చేసి గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని, అటవీ నివాసితుల హక్కుల గుర్తింపు చట్టం, 1/70, పీలా చట్టాల రక్షణ కల్పించాలని, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదవ షెడ్యూల్లో చేర్చాలని వంటి డిమాండ్లను బలపర్చుతూ ఈ బహిరంగ సభలో వక్తలు ప్రసంగించనున్నారు.

ప్రదర్శన, బహిరంగ సభకు జెండాలను సిద్ధం చేస్తున్న సిపిఎం కార్యకర్తలు

జయప్రదం చేయండి : సిపిఎం

విఆర్.పురం : చింతూరులో గురువారం వామపక్షాలు అద్వర్యంలో జరుగుతున్న బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు విజ్ఞప్తి చేశారు. మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఒకే భాష, ఒకే విద్య, ఒకే మతం అంటూ బలవంతంగా ప్రజలపై మనువాదం భావజాలం రుద్దుతుందని, కట్టుకునే బట్ట తినేతిండిపై కూడా మోడీ సర్కార్ ఆంక్షలు విధిస్తుందని తెలిపారు. ఆదివాసీ సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను దెబ్బతీసే విధంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని, అమాయక గిరిజనుల హృదయాల్లో విషాన్ని నింపుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పంకు శ్రీరామ్మూర్తి, వడ్లది రమేష్, నల్లాపు ప్రకాష్ రావు పాల్గొన్నారు.

కూనవరం : చింతూరులో బహిరంగ సభకు గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. బుధవారం ఓ వివాహం నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన హక్కుల కాలరాస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పాల్గొన్నారు.

కూనవరం మండల నాయకులతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నేతలు

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలి

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: జిల్లాలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో ఆ సంఘం మండల కార్యదర్శి పి.రామన్న అద్యక్షతన బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి, కొయ్యూరు, అనంతగిరి మండలాలలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధాని కంపెనీతో ఒప్పందం చేసుకున్నాయని, వెంటనే వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో పీసా చట్టం, గ్రామ సభ, ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా చట్ట విరుద్ధంగా ఆయా మండలాలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌లను ఆదానికి కట్టబెడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అటవీ, పర్యావరణ అనుమతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.గిరిజన ప్రాంతాల్లో ఉన్న అడవులను పెట్టుబడిదారులకు కట్టబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నాయన్నారు. దీంతో గిరిజన ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసి గిరిజనులు నిర్వాసితులవుతారని తెలిపారు. రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన చట్టాలు, హక్కులకు రక్షణ కల్పించవలసిన అధికారులు, ప్రజాప్రతినిధులు కాల రాస్తున్నారని మండిపడ్డారు. బీసీ కులస్తులైన బోయ/వాల్మికిలకు గిరిజన జాబితాలో చేర్చాలని తీర్మానం చేయడంతో గిరిజన హక్కులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.అనంతగిరి మండలం నిమ్మలపాడు మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రోజెక్టులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలకు గిరిజన ప్రజలు మద్దతు తెలపాలని పిలుపుచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండల కార్యదర్శి జె.సుబ్బరావు, గిరిజన సంఘం నాయకులు కొండలరావు, బుజ్జిబాబు, గాసి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కె సురేంద్ర

అధికార పార్టీ బెదిరింపులు ఆపాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

అధికార పార్టీ నాయకుల బెదిరింపులు ఆపాలని గిరిజన సంఘం, ఆదివాసీ సంక్షేమ పరిషత్తు నాయకులు డిమాండ్ చేశారు. మండలం కేంద్రంలో బుధవారం అధికార పార్టీ వేధింపులకు వ్యతిరేకంగా ఆదివాసీ పోరాట సంఘీభావ సభ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లె రెడ్డి అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఓట్ల కోసం గిరిజనులకు మోసం చేస్తూ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నాయని తెలిపారు. ఒక వైపు బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని సమర్థిస్తూనే, మళ్ళీ వారే ఆదివాసీల కోసం నిలబడతామని ప్రకటనలు చేయడం దారుణమన్నారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతూ ప్రభుత్వం చేసిన తీర్మానానికి వ్యతిరేకిస్తున్న గిరిజనులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని చూస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ఉద్యమ కారులపై దౌర్జన్యం, బెదిరింపులు ఆపకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా గౌరవ అధ్యక్షులు కురసం ఫకీరు దొర, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఆవుల ధర్మారెడ్డి, జెఎసి నాయకులు కత్తుల రమణరెడ్డి, రేవుల జానకిరెడ్డి, సర్పంచ్ ఈతపల్లి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న గిరిజన సంఘం, ఆదివాసీ సంక్షేమ పరిషత్తు నాయకులు

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ అడహళ్లి అన్నారు. గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో గంగవరం యువసేన, ఓల్డ్ టైగర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కలుముల కామరాజుదొర మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో యువత క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని, జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలని సూసించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, బాగా చదువుకొని కుటుంబానికి మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పలాల కృష్ణారెడ్డి, జెడ్పిటిసి బేబీ రత్నం, సర్పంచ్ కలుమల అక్కమ్మ, వైస్ ఎంపీపీ కె గంగాదేవి, సీఐ రాంబాబు, ఎస్ఐ చిన బాబు, ఉపసర్పంచ్ పి వెంకటేశ్వరావు, మాజీ ఎంపిపి తీగల ప్రభ తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎఎస్‌పి జగదీష్

కొండ గొర్రెను రక్షించిన వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద గురువారం అడవి నుండి దారి తప్పి వచ్చిన కొండ గొర్రెను వైద్య సిబ్బంది రక్షించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. కొండ నుంచి తప్పిపోయి వచ్చిన కొండ గొర్రెను కుక్కులు తరమగా అది వాటి నుండి తప్పించుకొని ఆసుపత్రి వెనక గేటు ద్వారా వచ్చి ఇరుక్కు పోయింది. అది గమనించిన ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న మడకం శివ ఆసుపత్రి సిబ్బందికి తెలియజేశాడు. దీంతో డాక్టర్ మధు మధు వెంటనే స్పందించి సెక్యూరిటీ నాగేశ్వరరావు సహాయంతో ఆటోలో తీసుకొని వెళ్లి రంపచోడవరం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్‌కు అప్పగించారు. వారు గాయాలకు చికిత్స అందించి అడవిలో విడిచిపెట్టారు.

కొండ గొర్రెను అటవీశాఖ అధికారులకు అప్పగిస్తున్న వైద్యాధికారి మధు తదితరులు

బాధితులకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-పెదబయలురూరల్: గత రెండు నెలల క్రితం కాకినాడ ఆయిల్ ట్యాంకర్ లో మృతి చెందిన మండలంలోని పర్రెడ పంచాయతీ లక్ష్మిపురం గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను బుధవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ అనకాపల్లి రీజినల్ మేనేజర్ పి.సురేష్ పరామర్శించారు. ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలను ఐదు కుటుంబాలకు గాను ప్రధానమంత్రి జీవన్ జ్యోతి స్కీం ద్వారా రెండు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం పిక్సిడ్ డిపాజిట్స్ బాండ్స్ మాజీ ఎంపీపీ కొండయ్య, బొండ పల్లి సర్పంచ్ బి మత్యరాజు బాధిత కుటుంబాలకు రెండు కోట్ల 50 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, ఈ ఆర్థిక సహాయాన్ని వృధా చేయకుండా పిల్లల భవిష్యత్ నిమిత్తం జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమ ంలో ఆడిట్ మేనేజర్ ఆనంద్, డివిజనల్ మేనేజర్ తారకేష్, స్థానిక పెదబయలు గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ పవన్ సాయి, బ్యాంకు మిత్రలు కొండబాబు, శ్రీను పాల్గొన్నారు.



బాధునకు అందజేస్తున్న రీజనల్ మేనేజర్ సురేష్

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు మండల ఆదివాసి జెఎసి కమిటీని బుధవారం పట్టణంలోని గిరిజన భవన్ వద్ద అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.శేషాద్రి, బి.సింహాచలం, జెఎసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.గంగరాజు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా వి.దేముడు, కో-కన్వీనర్‌గా జి.లింగమూర్తి, ప్రధాన కార్యదర్శిగా టి.సురేష్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా పి.విజయలక్ష్మి, కోశాధికారిగా బి.మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా 13 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జెఎసి రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు జిల్లా, మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆదివాసి హక్కులు, చట్టాల పరిరక్షణకు ఉద్యమం ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

రేషన్ పక్కదారిపై చర్యలు ఏవీ?

ప్రజాశక్తి -హుకుంపేట: రేషన్ సరుకుల పక్క దారి పట్టించిన డీలర్‌లపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నేతలు వి.లక్ష్మణ్‌రావు, టి.అప్పలకొండపడల్, ఎస్.హైమావతి డిమాండ్ చేశారు. బుధవారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పట్టాం పంచాయతీ డీపోలో రేషన్ సరుకులు పక్క దారి పటించిన ఎండియు ఆపరేటర్, డీలర్ అవకతవకలకు పాల్పడ్డారని పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులు ఎందుకు స్పందించ లేదని వారు ప్రశ్నించారు. మార్చి నెలలో సరుకులు ఇవ్వకపోయినా ఇచ్చినట్లు నమోదు చేయడంపై చర్యలేవన్నారు.దర్యాప్తు చేపట్టి బాధితులకు రేషన్ సరుకులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే రేషన్ సరుకులు కోత విధిస్తున్నారన్నారు.

19 నుంచి పారిశుధ్య కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-పాడేరు: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19 నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేపట్టాలని ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల సంఘం(సిఐటియు) నిర్ణయించింది. ఆస్పత్రులలో పనిచేసే పారిశుధ్య కార్మికులతో పాటు సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కారం చేయాలని జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం పాడేరులో నిర్వహించారు.. అనేక సార్లు అధికారులకు సమస్యలను తెలియజేసినా పరిష్కారం కాలేదన్నారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎల్ సుందరరావు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని పాడేరు, అరకు, ముంచంగిపుట్టు, చింతపల్లి ఆసుపత్రుల్లో గత 20 సంవత్సరాల నుండి పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు పని చేస్తున్నారని తెలిపారు. నెలకు వీరికి రాష్ట్ర ప్రభుత్వం 16 వేలు చెల్లిస్తున్నామని చెబుతున్నప్పటికీ పారిశుధ్య కార్మికులకు గరిష్టంగా రూ.9000ల నుండి 10,700, సెక్యూరిటీ గార్డులకు రూ.8366 మాత్రమే కాంట్రాక్టర్లు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ కార్మికుల నుండి వసూలు చేస్తున్నప్పటికీ యజమాన్యం చెల్లించ లేదన్నారు. తక్షణమే కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి వైద్య విధాన పరిషత్ ద్వారా జీతభత్యాలు చెల్లించాలన్నారు. పాడేరు జిల్లా ఆసుపత్రిలో 200 పడకలకుగాను వంద పడకల సిబ్బందితోనే పనులు నిర్వర్తిస్తున్నారని, అరుకుఏరియా ఆసుపత్రిలో 150 పడకలకు గాను 100 పడకల సిబ్బంది ఉన్నారన్నారు. పారిశుధ్య కార్మికులపై పని భారం ఎక్కువై తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఫేషియల్ యాప్ రద్దు చేసి, ప్రతి నెలా జీతాలు సక్రమంగా చెల్లించాలని, పరికరాలు, యూనిఫామ్ సక్రమంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పారిశుధ్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘు, ముత్యాలమ్మ, చింతపల్లి, ముంచంగి పుట్టు కార్మికులు రామారావు, కాశినాద్, పుణ్యవతి, సింహాచలం, నగేష్, రాజేశ్వరి, కొండమ్మ పాల్గొన్నారు.

16 వేల ఎకరాల్లో కాఫీ విస్తరణ : కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: కాఫీ లైజన్ వర్కర్లు కాఫీ రైతులకు అండగా ఉండి రైతులను ప్రోత్సహించాలని, ఈ ఏడాది అదనంగా మరో 16 వేల ఎకరాలలో కాఫీ విస్తరణకు చర్యలు తీసుకోవాలని అందుకు అనుగుణంగా నర్సరీలను అభివృద్ధి చేయాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, కాఫీ నర్సరీలు పెంపొందించి రైతులకు కాఫీ రకాలను వివరించి ఒకే రకమైన మొక్కలను ఒకే వరసలో వేసేలా అవగాహన కల్పించాలన్నారు. అన్ని రకాల మొక్కలు ఇష్టానుసారంగా వేయడంతో పంట దిగుబడి తగ్గటంతో పాటు, మిశ్రమ రకాల వల్ల ధర తగ్గి రైతులు నష్టపోతారని తెలిపారు. దీనిపై అవగాహన కల్పించాల్సిన భాధ్యత లైజన్ వర్కర్లు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నర్సరీ మొక్కల కోసం వినియోగిస్తున్న పోలీ బ్యాగ్స్ నాణ్యత పై మండిపడ్డారు. నాణ్యత లేని పోలీ బ్యాగులు ఎందుకు తీసుకున్నారని లైజన్ వర్కర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన దగ్గర ఉన్న మూడు రకాల పోలీ బ్యాగు నమూనాలను తెప్పించి వాటి నాణ్యతలో తేడాలపై విశ్లేషించి నాణ్యతా ప్రమాణాలను చూపించారు. అందులో ఉత్తమ రకాన్ని ఎంపిక చేసి సంబంధిత కాంట్రాక్టర్ తో చర్చించి టోకుగా ఆర్డర్ ఇవ్వాలని ఆదేశించారు. అదేవిధంగా గతంలో నాణ్యత లేని పోలీ బ్యాగుల సరఫరాదారులకు బిల్లు చెల్లించవద్దని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ ను ఆదేశించారు. నర్సరీలో మొక్కలు రైతులకు సరఫరా చేసిన తరువాత వాటిని ప్రూనింగ్ (కత్తిరింపు), పొదలు తొలగింపు లాంటి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి వారికి అండగా నిలవాలని ఆదేశించారు. జూన్ 15 నాటికి మొక్కల ఎదుగుదలపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రైతులకు సరఫరా చేసిన మొక్కల రకాలు, పోలీ బ్యాగులను రికార్డులలో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, కాఫీ ఏడి ఎన్.అశోక్, ఎపిఒ (పిటిజి) ఎం.వెంకటేశ్వర రావు, కాఫీ బోర్డు ప్రతినిధులు, ఉద్యాన శాఖ అధికారులు, లైజన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ముసురుతో వ్యాపారుల అవస్థలు

ప్రజాశక్తి-పెదబయలు రూరల్:మండలంలో నిత్యం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నడిరోడ్డుపై వ్యాపారం చేసుకుంటున్న వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. వర్షంతో కొనేవారు లేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమాటా, ఇతర సరుకులు కుళ్లి పోతున్నాయని వ్యాపారులు వాపోయారు. అప్పు చేసి పెట్టుబడులతో దుకాణాలు పెట్టుకొని జీవిస్తున్నామని, వర్షాలతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

వర్షంలో ఇబ్బందులు పడుతూ వ్యాపారులు చేస్తున్న మహిళలు

మోదకొండమ్మ జాతరకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా మోదకొండమ్మ జాతర నిర్వహణ చాలని, ఇందుకు పటిష్టంగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈనెల 14,15,16 తేదీలలో నిర్వహించనున్న మోదకొండమ్మ జాతర ఏర్పాట్లపై అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో ఐటిడిఎ సమావేశ మందిరంలో బుధవారం రెండవ విడత సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్సవంలో నిరంతరం రెండు షిఫ్టులలో పారిశుధ్య పనులు నిర్వహించాలని పంచాయతీ విభాగం అధికారులను ఆదేశించారు. అనుభవం కలిగిన స్కిల్డ్ లేబర్‌ను నియమించాలని సూచించారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆ మేరకు విద్యుత్ సిబ్బందిని నియమించాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు. ఉత్సవాలలోను, ఉత్సవాలలో తాగునీటి సమస్యలు లేకుండా ప్రత్యేకంగా ట్యాంకర్లతో సరఫరా చేయాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు సూచనలు జారీ చేశారు. మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నిరంతరం వైద్య సేవలందించాలని, మూడు అంబులెన్సులను అందుబాటులో ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. అత్యవసర మందుల నిల్వలను సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణంలో పూర్తి స్థాయిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జాతరకు వచ్చే సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగినన్ని బస్సులు నడపాలని ఆదేశించారు. ఉత్సవం విధులు నిర్వహించడానికి కేటాయించిన అధికారులకు, సిబ్బందికి ప్రొసీడింగ్సు జారీ చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. ఐటిడిఏ కాఫీ విభాగం, ఉద్యాన వనశాఖ, వ్యవసాయ, పశు సంవర్ధక, వైద్య ఆరోగ్య శాఖ, జి.సి.సి, ఐసిడి ఎస్, వెలుగు విడికె, గిరిజన సంక్షేమ, సమాచార శాఖ ఫోటో ప్రదర్శన, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రదర్శన స్టాల్సు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడి ఏ పి.ఒ వి. అభిషేక్, ఎ. ఎస్. పి కె. ధీరజ్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఐటిడిఎ ఎపిఒ వి.ఎస్. ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, డిపిఒ కొండలరావు, డిఎల్‌పిఒ పి.ఎస్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి.వి.ఆర్. ఎం.రాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు వర్తన పిన్నయ్యదొర, గౌరవ అధ్యక్షులు కొట్టగుళ్లి సుబ్బారావు, ఉపాధ్యక్షులు వంతిసెట్టి రాజబాబు, ప్రధాన కార్యదర్శులు నవర మోద కొండబాబు, తమర్ల ప్రసాదరావు నాయుడు, సంయుక్త కార్యదర్శులు మాగాపు సత్యమోహన్, బూరెడ్డి రాము, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డేటా కేంద్రం విశాఖకు తలమానికం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

రాజేష్ అదానీ, కరణ్ అదానీలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో : విశాఖపట్నం డేటా కేంద్రం దేశానికి తలమానికం కానుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వెల్లడించారు. మధురవాడలోని హిల్ నంబర్ 4లో 190 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్, టెక్నాలజీ బిజినెస్ పార్క్, అదానీ ఎంటర్ ప్రైజస్ లిమిటెడ్ చైర్మన్ రాజేష్ అదానీ, కరణ్ అదానీలతో కలిసి ముఖ్యమంత్రి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నంలో 300 మెగా వాట్ల ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్, టెక్నాలజీ బిజినెస్ పార్క్ శంకుస్థాపన చేయడం గొప్ప శుభపరిణామమన్నారు. సింగపూర్ నుంచి సబ్ మెరైన్ కేబుల్‌ను విశాఖపట్నం తీసుకువచ్చే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సబ్ మెరైన్ కేబుల్ రావడం డేటా సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయడం వల్ల ఇంటర్నెట్ డౌన్‌లోడ్ స్పీడ్ చాలా వేగాన్ని అందుకోవడం డౌన్ లోడ్ అవడం ఇక్కడ ఉన్న పరిశ్రమలకు మరియు ప్రజలకు గొప్ప వరం అవుతుందని వివరించారు. అదానీ గ్రూపు ఈ ప్రాంతంలో రూ.22 వేల కోట్ల పెట్టుబడి పెట్టి ఐటి అభివృద్ధికి గట్టిగా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బూడి ముత్యాలనాయుడు, బొత్స సత్యనారాయణ, విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జెడ్‌పి చైర్‌పర్సన్ జె.సుభద్ర, విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణ, ఐటి పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికల్ వలవన్, ఐటి శాఖ కార్యదర్శి కోన శశిధర్, ఐటి, పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖపట్నం, విజయనగరం జిల్లాల పర్యటన అనంతరం విశాఖ విమానాశ్రయం చేరుకొని విజయవాడ బయలుదేరిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి మంత్రులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం సాయంత్రం 4:25 గంటలకు విశాఖ విమానాశ్రయానికి జగన్మోహన్‌రెడ్డి చేరుకున్నారు. అక్కడ మంత్రులు విడదల రజిని, గుడివాడ అమర్నాథ్, బొత్స సత్యనారాయణ, టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, తదితరులు వీడ్కోలు పలికారు. ముఖ్యమంత్రి ప్రత్యేక విమానంలో 4:30 గంటలకు విజయవాడ బయలుదేరి వెళ్లారు.

దువ్వాడలో నాన్-ఇంటర్ లాకింగ్ పనుల పరిశీలన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ కుమార్ సత్పతి దువ్వాడ సెక్షన్‌లో జరుగుతున్న భద్రత సంబంధిత ఆధునికీకరణ పనులను బుధవారం పరిశీలించారు. దువ్వాడలో ప్రస్తుతం ఉన్న ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్‌ల భర్తీకి సంబంధించి నాన్-ఇంటర్‌లాకింగ్, ప్రీ-ఎన్ఐ పనులు పురోగతిలో ఉన్నాయి. డిఆర్ఎం పురోగతిలో ఉన్న పనులను పరిశీలించి, రైళ్లు, సమయపాలన ఖచ్చితత్వంతో వ్యవహరించడంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

'జనసేన కార్పొరేటర్ ఆరోపణలు అవాస్తవం'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జివిఎంసిలో రూ.100 కోట్లు అవినీతి జరిగిందని, ఇందుకు బాధ్యులు పాత కమిషనర్ బాబూరావు అంటూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రమూ వాస్తవం లేదని డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్ చెప్పారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దళిత ఐఎఎస్ అధికారి బాబూరావును టార్గెట్ చేస్తూ ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. నగరంలో జరిగిన పెట్టుబడుల సదస్సు, జి20 సదస్సు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో జరిగాయని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో, వీటి నిర్వహణకు అవసరమైన ఖర్చును ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకోసం రూ.83 కోట్లు ఖర్చు కాగా, రూ.100 కోట్లు ఖర్చు చేశారని, జనసేన కార్పొరేటర్ ఏ విధంగా ఆరోపిస్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైసిపి కార్పొరేటర్లు కంపా హనోక్, రెయ్యి వెంకటరమణ, శశికళ, బల్లా లక్ష్మణరావు, మాసిపోగు మేరీ జోన్స్ పాల్గొన్నారు.

ఐఎన్‌టియుసి వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఐఎన్‌టియుసి వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి హెచ్ పిసిఎల్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.తాతబాబు మాట్లాడుతూ, కార్మికులంతా సమష్టిగా ఉంటూ, ఇతర సంఘాలను కలుపుకొని సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఇంటక్ కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.హరి, ఆర్. గోపి, వి.కనకరాజు, పి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

7న జిల్లా చిల్డ్రన్ చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ, ఎంవిపి.కాలనీ : విశాఖ జిల్లా చిల్డ్రన్ చెస్ టోర్నమెంట్‌ను ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు అల్ విశాఖ చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.మణికంఠరావు తెలిపారు. సీతమ్మధార సామాజికభవన్‌లో అండర్ 7, 9, 11, 13, 15, 17 విభాగాలలో బాలురు, బాలికలకు చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, ఆయా విభాగాల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విజేతలకు మెమోంటోలు అందచేస్తామని ప్రకటించారు. 2006 జనవరి 1 తరువాత పుట్టిన బాల బాలికలు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు అర్హులని, ఈ నెల 6న సాయంత్రం 5 గంటలలోపు ఎపి చెస్ ఓఆర్‌జీ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9848460137, 9989971232ను సంప్రదించాలని సూచించారు.

పక్షులకు నీటిని అందుబాటులో ఉంచుదాం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : 'పిచ్చుకలను పరిరక్షిద్దాం.. పక్షులకు, ఇతర చిన్న జీవులకు నీటిని అందుబాటులో ఉంచుదాం.. ఆహారం కోసం చిరుధాన్యాలను అందుబాటులో ఉంచుదాం' అని ఆంధ్ర యూనివర్సిటీ సోషల్ వర్క్ డిపార్ట్మెంట్ హెడ్ హరినాథ్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్‌లో పక్షుల పరిరక్షణ కార్యక్రమంపై గ్రీన్ క్లైమేట్ ఎన్జీవోతో సంయుక్తంగా ఒక కార్యక్రమం నిర్వహించారు. పక్షులకు ఇతర జీవులకు నీరు అందుబాటులో లేకపోవడం వల్ల వడదెబ్బకు మత్యువాత పడుతున్నాయని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో 10,000 పిచ్చుక గూళ్ళు మంచినీరు ఆహారం కోసం 20,000 మట్టి పాత్రలు ఏర్పాటు చేస్తోందని తెలిపారు.

యోగాతో ఆరోగ్యం

విద్యార్థులకు యోగా శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు లోవయ్య

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : యోగా ద్వారా మంచి ఆరోగ్యంతో బాటు మనశ్శాంతి కలుగుతుందని యోగా ఉపాధ్యాయులు కె లోవయ్య అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సమ్మర్ క్యాంపులో భాగంగా ఈ నెల 1నుంచి జూన్ 3 వరకు యోగా క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 6 నుండి 7 గంటల వరకు, సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు లోవయ్య తెలిపారు. బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ సంస్థ ద్వారా ఈ ఉచిత యోగా సమ్మర్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరు యోగసాధనలో పాల్గొని ఆరోగ్యం మెరుగుపరచుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు కోరారు. మరిన్ని వివరాలకు 9182867512 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోదవరం మండల పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం రంపచోడవరం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ ఎండి.యూసఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రంపచోడవరం, సిరిగిండలపాడు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

యుటిఎఫ్ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -విఆర్.పురం : రంపచోడవరం యుటిఎఫ్ భవన్ ఈ నెల 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు జరగనున్న యుటిఎఫ్ ఉద్యమ శిక్షణ తరగతులకు విలీన నాలుగు మండలాల యుటిఎఫ్ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పండా కిష్టయ్య పిలుపునిచ్చారు. మండలంలోని సున్నం వారిగూడెం గ్రామంలో యుటిఎఫ్ జిల్లా మహిళా అసోసియేషన్ సభ్యులు ముర్రం కవిత అధ్యక్షతన బుధవారం జరిగిన నాలుగు మండలాల యుటిఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 7న కాకినాడ యుటిఎఫ్ భవన్‌లో ఒక రోజు వర్క్ షాప్ కూడా ఉందని చెప్పారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ నాయకులు యు.వెంకటనారాయణ, పి.కన్నారావు ఎన్.జగదీష్, బి.ముత్తయ్య, ఎం.రాంబాబు, కుర్సం బ్రహ్మయ్య, కె.తులసి, నూనె రామకృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిపై 'గీతం' దృష్టి

ప్రైపెస్టా, ఎడూమూన్ సంస్థలతో ఎంఓయు : వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ తదితర వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థులలో నైపుణ్యాలను పెంచడానికి గీతం విశ్వవిద్యాలయం అన్ని చర్యలు తీసుకుంటోందని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం అన్నారు. బుధవారం గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ శిక్షణ, ఆన్‌లైన్ కోర్సులు, సదస్సులు నిర్వహించడానికి ప్రెపెన్‌స్టా, ఎడూమూన్ సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థుల నైపుణ్యాలను పెంచుకోవడానికి ఈ ఒప్పందాలు దోహదపడతాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రెపెన్‌స్టా సంస్థ వ్యవస్థాపకుడు అతుల్య కౌశిక్, డైరక్టర్ మనీస్ అగర్వాల్‌లతో పాటు ఎడూమూన్ చీఫ్ డవలప్‌మెంట్ ఆఫీసర్ బ్రిజేష్ బాబు, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ పాల్గొన్నారు. ఈ అవగాహన ఒప్పందాల ద్వారా గీతం విద్యార్థులకు 20కి పైగా సర్టిఫికేట్ కోర్సులు, ప్రాంగణ నియామకాలకు ఉపయోగపడే స్టడీమెటీరియల్, నూతన నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ అధికారులు వెల్లడించారు.

అసంక్రమిత వ్యాధులపై ఇంటింటా సర్వే

ఇంటింటా సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి -మధురవాడ : స్థానిక పిహెచ్‌సి పరిధిలో అసంక్రమిత వ్యాధులపై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి తెలిపారు. ఇందులో భాగంగానే ఏడో వార్డు వాంబే కాలనీలో పిహెచ్‌సి వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి, ఆయా ఇళ్లలో అధిక రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, హార్మోన్ సమస్యలు, రక్తహీనత, కేన్సర్, మానసిక వ్యాధులు, కిడ్నీ, గుండె, దంతాలు తదితర వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి, ఎన్‌సిడిసిడి యాప్‌లో నమోదు చేసి ప్రతి ఒక్కరికీ ఒక గుర్తింపు నెంబరు(ఐడి) ఇస్తారన్నారు. దీనికి గాను ఆధార్‌తో మొబైల్ నెంబరును అనుసంధానించాల్సి ఉంటుందన్నారు. లేకుంటే సంబంధిత వ్యక్తులు ఒటిపి చెప్పాలన్నారు. సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని డాక్టర్ ప్రశాంతి కోరారు.

ఈ సర్వే ఆధారంగా నమోదు చేసిన వివరాల ఆధారంగా మున్ముందు అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో ఎక్కడికి వెళ్లినా, ఈ ఐడి నెంబరు నమోదు చేయగానే రోగికి సంబంధించిన పూర్వ అనారోగ్య సమస్యలు, వాడిన మందులు,ఏయే ఆసుపత్రుల్లో చికిత్స పొందారో పూర్తి సమాచారం తెలుస్తుందని, తద్వారా వైద్యం చేయడానికి సులభమౌతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లక్ష్మీ పాల్గొన్నారు.

చందనం ప్యాకెట్ల విక్రయాలు ప్రారంభం

ప్రజాశక్తి- సింహాచలం: భక్తులు ఎంతగానో ఎదురుచూస్తున్న సింహాద్రి అప్పన్న చందన ప్యాకెట్ల విక్రయాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఏడాది పొడుగునా సింహాద్రి అప్పన్న విగ్రహంపై ఉంచి, చందనోత్సవం రోజున ఒలిచిన చందనాన్ని ప్యాకెట్లుగా తయారుచేసి ఏటా అమ్మకాలు చేపడతారు. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే వీటిని కొనేందుకు బుధవారం భక్తులు బారులుదీరారు. ఒక్కొక్క ప్యాకెట్ రూ.పది చొప్పున, రోజుకు వెయ్యి ప్యాకెట్లను ఇలా ఐదురోజులపాటు అమ్మకాలు చేస్తామని దేవస్థాన అధికారులు తెలిపారు.

ఎఐవైఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-పెందుర్తి :అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 64వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని సుజాతనగర్, గిరిప్రసాద్ కాలనీలో విశాఖ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని యువతకు నాణ్యమైన విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాల కోసం పోరాటంతోపాటు, డ్రగ్స్, మద్యం మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు అవగాహన, చైతన్యం ఎఐవైఎఫ్ కల్పిస్తోందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీని కేంద్రంలో ప్రధాని మోడీ, ఇక్కడ రాష్ట్రంలో ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న మాటను సిఎం జగన్ అమలు చేయకుండా యువత జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు.

ఉచిత సీట్ల గడువు పెంపుపై ప్రచారం చేయాలి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం అన్ని ప్రయివేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని నరవ ప్రకాశరావు కోరారు. రాష్ట్రంలో 93 వేల సీట్లు మొదటి విడతలో కేవలం 9064 మందినే గుర్తించారని తెలిపారు. రెండవ విడతగా ఈ నెల 6 నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచారని, దీన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

5న జాబ్‌మేళా

ప్రజాశక్తి- కంచరపాలెం : విశాఖపట్నంలోని పలు సంస్థలలో ఉద్యోగాల భర్తీకి కంచరపాలెంలోని జిల్లా ఉపాధికల్పన కార్యాలయాలు (క్లారికల్, టెక్నికల్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5న శుక్రవారం ఉదయం 10 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి, కె సుధ తెలిపారు.

డిక్సన్ మ్యానుఫ్యాక్చరింగ్ లిమిటెడ్ (తిరుపతి)లో ఆపరేటర్/అసెంబ్లర్ ఉద్యోగాలు 100 ఖాళీల భర్తీకి పదవ తరగతి/ఇంటర్/ఏదైనా డిగ్రీ చేసిన 18-30 వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.14 వేలు జీతం ఇతర బెనిఫిట్స్ ఉంటాయన్నారు. ల్యాండ్ మార్క్ గ్రూపు (మాక్స్ పాసన్) సంస్థలో కస్టమర్ రిప్రజెంటేటివ్ ఎగ్జిక్యూటివ్/ క్యాషియర్/పార్ట్ టైమర్స్ 40 ఖాళీల భర్తీకి పదవ తరగతి/ఇంటర్/ ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన 18-28 వయస్సు గలవారు అర్హులు. వీరికి నెలకు రూ.15 వేలు జీతం ఉంటుందన్నారు. ఆరోవాన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో జూనియర్ క్యాడ్ ఇంజనీర్ ఉద్యోగాలు 30 ఖాళీల కొరకు డిప్లమో/బీటెక్ అర్హత కలిగి 18-30 వయస్సు గలవారు అర్హులు.వీరికి 15, వేలు జీతం ఉంటుందన్నారు. ఎక్స్ప్రెస్ బీస్ కం ఎక్స్ప్రెస్ సంస్థలో వేర్ హౌస్ అసోసియేట్స్ ఉద్యోగాలు 10 ఖాళీల కు పదవ తరగతి/ ఇంటర్/ ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన 18-35 వయస్సు గలవారు అర్హులు వీరికి రూ.12, వేలు జీతం రూ.2వేలు అటెండెన్స్, బోనస్, పిఎఫ్, ఈఎస్ఐ, నైట్ అలవెన్సెస్ ఉంటాయన్నారు. రాక్‌మాన్ ఇండస్ట్రీస్ సంస్థలో టెక్నీషియన్స్, జూనియర్ ఇంజనీర్స్ ఉద్యోగాలు 50 ఖాళీల కొరకు ఐటిఐ, డిప్లమో అర్హత కలిగి 18-25 వయస్సు గలవారు అర్హులు. వీరికి నెలకు రూ.14, వేలు జీతం చెల్లిస్తారు. . ఖజానా జ్యువెలర్స్ సంస్థలు సేల్స్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్ ఉద్యోగాలు 80 ఖాళీల కొరకు ఇంటర్, ఏదైనా డిగ్రీ అర్హత గల 18-32 వయస్సు కలిగిన వారు అర్హులు వీరికి నెలకు రూ.17, వేల నుండి రూ.20, వేలు జీతం ఇన్సెంటివ్స్ ఉంటాయన్నారు.

కాన్సెంట్రిక్స్ సంస్థలో వాయిస్ ప్రాసెస్ (ఇంగ్లీష్, హిందీ స్పీకింగ్ స్కిల్స్) ఉద్యోగాలు 50 ఖాళీల కొరకు ఇంటర్/ఏదైనా డిగ్రీ అర్హత గల 18-28 వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులు వీరికి నెలకు రూ.15 వేలు జీతం ఉంటుంది. ఎక్స్ టెక్ బెస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఎన్‌డిటి ట్రైనీస్ ఉద్యోగాలు 10 ఖాళీలకు ఐటిఐ, డిప్లమో మెకానికల్,సివిల్ అర్హత కలిగి 21 28 వయస్సు గలవారు అర్హులు. నెలకు రూ.12 వేలు జీతం అలవెన్సెస్ చెల్లిస్తారు.. ఐనాక్స్ సంస్థలో గెస్ట్ సర్వీస్ అసోసియేట్స్/ క్యాషియర్ ఉద్యోగాలు 15 ఖాళీల కొరకు పదవ తరగతి ఇంటర్, ఏదైనా డిగ్రీ అర్హత కలిగి 18-25 వయస్సు గలవారు అర్హులు. వీరికి నెలకు రూ.12,500 జీతం ఉంటుందన్నారు. వైఎస్‌కే ఇన్ఫోటెక్ విశాఖపట్నం సంస్థలో ఐటిఐ సపోర్టర్స్, టెక్నీషియన్స్, జూనియర్ ఇంజనీర్స్, ఉద్యోగాలు 150 ఖాళీలభర్తీకి పదవ తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటిఐ డిప్లమో బిటెక్ అర్హత కలిగిన 18- 35ఏళ్ల వయస్సు గలవారు అర్హులు. వీరికి నెలకు రూ.15 వేలు జీతం చెల్లిస్తారు. అర్హత, అసక్తిఉన్న అభ్యర్థులు ముందుగా తమ వివరాలను ncs.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని బయోడేటా, సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరు కావలసిందిగా కోరారు

ఎనిమిది గంటల పని విధానం అమలుకు ధర్నా

తారాచంద్ లాజిస్టిక్‌లో కాంట్రాక్టు కార్మికుల వెట్టిచాకిరీపై ఆందోళన

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ డిస్పాచ్ యార్డు(సిడివై)లోని తారాచంద్ లాజిస్టిక్ కంపెనీలో ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు ఒవి.రావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ సిడవైలో ఆటవిక రాజ్యం నడుస్తోందని, ఇక్కడి కార్మికులతో కాంట్రాక్టర్లు వెట్టిచాకిరీ చేయిస్తున్నా ఉక్కు యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మికులు ధర్నా కూడా చేయకుండా గేట్లు మూసివేసి, పరోక్షంగా తారాచంద్ యాజమాన్యానికి ఉక్కు యాజమాన్యం కొమ్ముకాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ప్రభుత్వరంగ సంస్థకు అనుబంధంగా ఉన్న కాంట్రాక్టర్ వద్ద ఎనిమిది గంటల పని దినం అమలు కోసం కార్మికులు పోరాటం చేయాల్సిన పరిస్థితులు నెలకొనడం దురదష్టకరమన్నారు.

మరో వైపు ఎనిమిది గంటల పని విధానం అమలుకు ప్రశ్నించిన కార్మికులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, విధుల నుంచి తొలగిస్తామని కాంట్రాక్టర్లు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితిలో మార్పు రాకపోతే ప్లాంట్ వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ. జి శ్రీనివాసరావు, వి వరహాలు, కెపి సుబ్రమణ్యం, ఎన్ కృష్ణ. పి మసేను, కె సత్యవతి, ఎ అప్పారావు, ఎ శ్రీ ను, పి నారాయణరావు పాల్గొన్నారు.